క్లుప్తంగా

ఘనంగా సంకష్టహర చతుర్థి



నగర వీధుల్లో సంకీర్తన చేస్తున్న భక్తులు

బోట్‌క్లబ్‌: సంకష్టహర గణేశచతుర్థి సందర్భంగా కాకినాడ స్వయంభు భోగిగణపతి పీఠంలో ద్రాక్ష పండ్ల పాలవెల్లితో శనివారం ఉత్సవం నిర్వహించారు. సుప్రభాత వేళలో సన్నాయి మంగళ వాయిద్యాలతో విఘ్నేశ్వర ప్రతిమ, సిద్ధి, బుద్ధి కలశాలు వేంకటేశ్వర చిత్రపటం చేపట్టి పలు వీధుల్లో పుష్పార్చనతో నగర సంకీర్తన చేశారు. పంచామృత అభిషేకం అనంతరం 27వ శ్రీవారి జపయజ్ఞ పారాయణ చేపట్టారు. సాయంత్రం వేళ సహస్రనామ పారాయణ లక్ష వత్తులతో అఖండ హారతి, ప్రసిద్ధ గాయకుడు మేడిశెట్టి శ్రీరాములు భక్తి గానలహరి ఏర్పాటు చేశారు. పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ స్వయంభువుకు కవచ యజ్ఞం జరిగిన సందర్భంగా 24 వ్రత కల్పాలుగా గత మాఘ మాసం నుంచి 2026 ఫిబ్రవరి వరకు ప్రతి నెల సంకష్ట హర గణేశ చతుర్థి వేడుకలు జరుగుతున్నాయన్నారు.

వేసవి వినోదంలో గణిత గమ్మత్తులు



బొమ్మలను తయారు చేసే విధానాన్ని విద్యార్థులకు నేర్పుతున్న ఉపాధ్యాయులు

కాకినాడ సిటీ: పాఠశాల విద్యాశాఖ, వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వేసవినోదంలో శనివారం గణితంలో గమ్మత్తులపై అవగాహన కల్పించారు. ప్రముఖ గణితావధాని, గణిత ఉపాధ్యాయుడు పి.రవిశంకర్ పిల్లల్లో గణితంపై ఉన్న భయాన్ని గణిత ఆటలు, పాటలు, పజిల్స్, సులభ పద్ధతిలో గణిత విధానాల బోధనతో పోగొట్టారు. పప్పెట్రీపై పిల్లి గోవిందరాజులు శిక్షణ ఇచ్చారు. పదోతరగతి విద్యార్థులకు చదివే ప్రణాళికను, విషయాలను, సులభంగా పటాలు గీయటాన్ని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వీఎస్‌వీ రమణమూర్తి వివరించారు.

బోధనా పద్ధతులపై శిక్షణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో సివిల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఆన్ గూగుల్ ఎర్త్ ఇంజిన్ ఫర్ జియోస్పేషియల్ టెక్నాలజీపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ నిర్వహించిన సదస్సు శనివారం ముగిసింది. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రోగ్రాంలో జియో టెక్నాలజీ అప్లికేషన్, రిమోట్ సెన్సింగ్, ఏరియల్ ఫొటోగ్రఫీ తదితర అంశాలపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. సర్టిఫికెట్ల ప్రదానోత్సవానికి రిజిస్ట్రార్ ఎల్.సుమలత హాజరై సాంకేతిక యుగంలో విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందాలంటే అధ్యాపకుల బోధనలో వినూత్న పద్ధతులు రావాలని సూచించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సుబ్బారావు, జియాలజీ ప్రొఫెసర్ పద్మకుమారి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెత్త సేకరణలో అలసత్వం వద్దు

కాకినాడ: స్థానిక 8వ సర్కిల్ పరిధిలోని సూర్యనారాయణపురం, రంగయ్యానాయుడు వీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు పరిశీలించారు. తమ సిబ్బంది చెత్త సేకరణకు సకాలంలో వస్తున్నారా? లేదా? తడి–పొడి చెత్తను వేర్వేరుగానే సేకరిస్తున్నారా? డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారా? వంటి అంశాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కూడా చైతన్యవంతులై చెత్తను రోడ్లపైన, డ్రైనేజీలలో వేయకుండా ఇళ్లకు వచ్చే హూప్పర్, టిప్పర్ వాహనాలకు మాత్రమే అందజేయాలని సూచించారు. ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య సేవలు అందించగలమని స్పష్టం చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బోట్‌క్లబ్‌: బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీఎస్ఎన్ మూర్తి అన్నారు. స్థానిక అన్నమ్మఘాటీ సెంటర్ సమీపంలోని ఐస్ ఫ్యాక్టరీ వద్ద శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రోజురోజుకీ పెరుగుతున్న వేడిగాలలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మహాలక్ష్మి, పి.భారతి, సత్యకాంతి, సత్యవేణి, వినయ్, రామకృష్ణ పాల్గొన్నారు.



భర్తకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి





తండ్రి ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని



మామ ద్వారంపూడికి మద్దతుగా అల్లుడు ఉదయ్‌శేఖర్‌రెడ్డి ప్రచారం

కూటమి పార్టీలను దరిచేరనివ్వొద్దు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 25వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

కాకినాడ: అబద్ధాలతో ప్రజలను ఏమార్చే కూటమి పార్టీలను నమ్మి మోసపోవద్దని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఓటర్లకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన 25వ డివిజన్ నరసింహపేట, రిక్షాలపేట ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అధికారాన్ని దక్కించుకోవాలనే కాంక్షతో ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజల ముందుకు వస్తున్న టీడీపీ, జనసేన కూటమి పార్టీలను నమ్మొద్దని సూచించారు. అలాంటి పార్టీలకు వేసే ఓటు నిరుపయోగమేనన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఒక్క హామీని అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడ సిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. కుల మత రాజకీయాలకు అతీతంగా నగరంలో 92 వేల కుటుంబాల్లోని 85 వేల కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందించామని, ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించి ధైర్యంగా ప్రజలను ఓటు అడగగలిగే స్థితిలో ఉన్నామన్నారు. ఆయన వెంట స్థాని నాయకులు జగన్నాథన్ విజయ్‌కుమార్, పైడిరాజు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ ఉన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

సతీమణి ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి శనివారం 6వ డివిజన్‌లో భర్తకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాకినాడ నర్సింగ్‌హోం నుంచి విముక్తి కాలనీ, నూకాలమ్మమాన్యం, రెల్లిపేట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి భర్త ద్వారంపూడి చేసిన అభివృద్ధిని వివరిస్తూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కుమార్తెల ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడికి మద్దతుగా ఆయన కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన కనిపించింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు స్పందిస్తూ... జగన్ ప్రభుత్వం ద్వారా తాము ఎన్నో సంక్షేమ పథకాలను అందుకున్నామని, ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చారని, అందువల్ల వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, ద్వారంపూడిలను మరోసారి గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. డాక్టర్ అంజని 19వ డివిజన్ జగన్నాథపురం అక్బర్ అజామ్ కల్యాణమండపం ప్రాంతంలోను, మరో కుమార్తె ప్రణీత 29వ డివిజన్ లక్ష్మీనారాయణ కంపెనీ ప్రాంతంలోను ఎన్నికల ప్రచారం చేశారు. వీరి వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మితో పాటు స్థానిక నాయకులు, పార్టీ కన్వీనర్లు, అభిమానులు హాజరయ్యారు.

అల్లుడి ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి అల్లుడు డాక్టర్ ఉదయ్‌శేఖర్ రెడ్డి మామకు మద్దతుగా శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 2019 ఎన్నికలకు ముందు, ఆ తరువాత జరిగిన అభివృద్ధిని వివరిస్తూ 41వ డివిజన్‌లో పెనుమూడి వారివీధి, చావలివారివీధి, అచ్యుతాపురం రైల్వేగేటు ప్రాంతాల్లో ఆయన ఇంటింట ప్రచారం చేశారు. చేసిన అభివృద్ధిని గుర్తించి మరోసారి ద్వారంపూడిని గెలిపించాలని కోరారు. ఆయన వెంట స్థానిక నాయకులు గోడి సత్యవతి వెంకట్, సోమిశెట్టి నాగేశ్వరరావు, రాగం విక్రమ్, కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో అన్ని వర్గాలకూ మేలు

- ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబుకు జన నీరాజనాలు
- గైగోలుపాడులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థన

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మంచి జరుగుతుందని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు ప్రజలకు వివరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నియోజకవర్గంలో అన్ని గ్రామాలనూ స్పృశిస్తూ ప్రచారం చేస్తూ ప్రజలకు చేరువ అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట కోసం ఏ విధంగా నిలబడతారో వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట గ్రామంలో సచివాలయం–4 పరిధిలోని గైగోలుపాడులో శనివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి పాలిక నరసింహమూర్తి తదితరులు ఆధ్వర్యంలో కన్నబాబు ప్రచార వాహనంపై వీధుల్లో పర్యటిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు పట్టారు. దారిపొడవునా అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కన్నబాబుకు జైజై నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున కన్నబాబు ప్రచారానికి హాజరైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో గైగోలుపాడు జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ తమ నాయకుడు ఇచ్చిన మాటపై నిలబడతారని, మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి పక్కగా అమలు చేస్తారన్నారు. గత ఐదేళ్లలో నవరత్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించిన జగన్‌మోహన్‌రెడ్డి అదే ఉత్సాహంతో జనరంజకమైన మేనిఫెస్టోను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. మేనిఫెస్టోలోని ప్రతీ హామీని అమలు చేస్తారని, పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాలకు మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నులుకుర్తి రామకృష్ణ, గుబ్బల విజయ్, రేఖారెడ్డి, ధర్మారాజు, రామిరెడ్డి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గైగోలుపాడులో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు

వైఎస్సార్ సీపీతోనే ప్రజా సంక్షేమం

కరప: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలను గడప గడపకూ అందించారని, అటువంటి సంక్షేమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని సర్పంచ్ దేగల లలితకుమారి, ఎంపీటీసీలు పైలా రామతులసి, ముమ్మిడి బుచ్చిబాబు కోరారు. నడకుదురు గ్రామనాయకులతో కలసి వారు శనివారం ఇంటింటికీ తిరిగి సీఎం జగన్ సారథ్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు మరింతగా జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ నాయకులు పైలా గోవిందు, వై.కృష్ణార్జున, పోతల లోవప్రసాద్, యేమాటి ఏసు, దాలిపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నడకుదురులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నూతన ఆవిష్కరణలతో విద్యార్థులకు గుర్తింపు

- జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్
- ముగిసిన ఇస్పార్క్ టెక్నికల్ సింపోజియం



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థి జీవితంలో నూతన ఆవిష్కరణలు కీలకమని, వాటి ద్వారా గుర్తింపు కలుగుతుందని జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన ఇస్పార్క్–2024 టెక్నికల్ సింపోజియం శనివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గెలుపు ఓటములతో సంబంధం లేకుండా తమకు ఉన్న ఆలోచన సమాజ ప్రయోజకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రాజెక్టు రూపంలో ప్రదర్శించడానికి రావడం సంతోషమని, అంతేగాక విద్యార్థుల మధ్య అభిప్రాయాలు పంచుకోవడంతో పాటు జూనియర్లకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ లీలాకుమారి మాట్లాడుతూ ఇంజినీరింగ్ పూర్తిచేసిన తరువాత కొలువులే ప్రామాణికం కాకుండా స్టార్టప్ దిశగా ఆలోచన చేయాలన్నారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు, ప్రసాంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి ఫ్యాకల్టీ ఝాన్సీరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీఓ అప్పారావుకు అందజేస్తున్న వలంటీర్లు

కరప: గ్రామ వలంటీర్లుగా సేవలందిస్తున్న 9 మంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. కరప గ్రామ సచివాలయం–1 పరిధిలో వలంటీర్లు పెంకే సతీష్‌కుమార్, మేడిశెట్టి గాయత్రి, మట్టా పార్వతి ఆశాజ్యోతి, రాయుడు లక్ష్మీప్రసన్న, గ్రామసచివాలయం–2 పరిధిలో వలంటీర్లు బొల్లంగి ధనలక్ష్మి, పెంకే అరుణ, మేడిశెట్టి వెంకటలక్ష్మి, రాయుడు వీరవెంకట సత్యప్రసాద్, ఇళ్ల నాగమణి మండలపరిషత్ కార్యాలయానికి వెళ్లి తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కె.అప్పారావుకు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తమ వలంటీర్ పోస్టుకు రాజీనామా చేస్తున్నట్టుగా పత్రాలలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పనిచేస్తున్న సీఎం జగన్, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాలన్న తపనతో ఈ రాజీనామా చేసినట్టు తెలిపారు. ఇప్పటి నుంచి ఇంటింటికీ తిరుగుతూ ఎమ్మెల్యే కన్నబాబు గ్రామంలో చేసిన అభివృద్ధిని, ఇచ్చిన ఇళ్లస్థలం పట్టాలు, ఇతర సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా మళ్లీ కన్నబాబును, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి జగనన్నను రెండో సారి ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థిస్తామన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక





పార్టీలో చేరిన వారితో కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జనసేన–టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తన నివాసంలో వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక 45వ డివిజన్ కొండయ్యపాలెం ప్రాంతానికి చెందిన అయితంశెట్టి చిరంజీవి– పిఠాపురం రాజు మిత్ర బృందం టీడీపీ–జనసేనలకు గుడ్‌బై చెప్పి సుమారు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక నాయకులు కొమ్మిరెడ్డి చిన్ని, కర్రి కిశోర్, కర్రి గంగరాజు, వాకాడ సత్తిబాబుతో పాటు కొండయ్యపాలెం పెద్దల సమక్షంలో ఎమ్మెల్యే ద్వారంపూడి వీరికి పార్టీ కండువాలు కప్పారు.

యాదవుల చేరిక

స్థానిక 27వ డివిజన్ నుంచి సుమారు 30 మంది యాదవ సామాజిక వర్గ ప్రతినిధులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు మన్నె నాగేశ్వరరావు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు చిన్నమ్ములు, రాఘవతో పాటు మహిళలు, యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక నేతలు రాజాన ప్రకాష్, మనోజ్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

6వ డివిజన్ నుంచి

స్థానిక 6వ డివిజన్ కలరా పాకలు ప్రాంతంలోని రెల్లిపేటకు చెందిన సుమారు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. యువ నాయకులు మల్లిపాముల గణపతి, కొంతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ద్వారంపూడి స్వాగతం పలుకుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కష్టించి పనిచేయాలని, ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

మీడియా కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్

కాకినాడ సిటీ: ఎన్నికల నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమాచార కేంద్రం, ఎంసీఎంసీని ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన శనివారం సందర్శించారు. మీడియా సర్టిఫికేషన్, మీడియా మానిటరింగ్ కమిటీ పనితీరు, అభ్యర్థుల ప్రచారానికి ఇస్తున్న అనుమతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ ఎన్నికలపై వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన వార్తల వివరాలు ఆరా తీశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఇప్పటి వరకు వచ్చిన ప్రకటనలు, వాటి ఖర్చుల వివరాలు, సంబంధిత వ్యయ బృందాలకు పంపించిన వివరాలను పరిశీలించారు. మీడియా సెంటర్‌లోని అధికారులు, సిబ్బంది విధులను సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున వివరించారు. ప్రీ సర్టిఫికేషన్‌లో అభ్యంతరకర దృశ్యాలు, వాటిని తొలగించేందుకు ఎంసీఎంసీ బృందం తీసుకున్న చర్యలు, మీడియా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమాచారం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాకినాడ నగరాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎంసీఎంసీ సభ్యుడు కృష్ణమూర్తి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ సి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ భావన

కౌంటింగ్ సెంటర్ల వద్ద పటిష్ట భద్రత

- ఆర్వో వెంకటరావు ఆదేశం



ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన ఆర్వో వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శనివారం ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని, కౌంటింగ్ సెంటర్‌ను సందర్శించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆయా కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన పటిష్ట భద్రతపై ఎన్నికల అధికారులు, నగరపాలక సంస్థ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తొలుత జేఎన్టీయూకేలోని సివిల్ బ్లాక్‌ను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన కాకినాడ సిటీ నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాలపై సూచనలు ఇచ్చారు. అనంతరం మెక్లారిన్ గ్రౌండ్స్ ఆవరణలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కూడా సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయా కేంద్రాల వద్ద ఎన్నికల సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. కల్పించాల్సిన భద్రతపై సూచనలు ఇచ్చారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఈ రమేష్ బాబు ఎన్నికల అధికారులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



జేఎన్టీయూకేలో పలు కేంద్రాల పరిశీలనకు వచ్చిన కలెక్టర్ నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలకు జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి జేఎన్‌టీయూలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాలు, రిసెప్షన్ సెంటర్లను ఆయన ఎస్పీ సతీష్ కుమార్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, జేఎన్టీయూ, వివిధ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో కలిసి పరిశీలించారు. జేఎన్‌టీయూకేలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ, మెకానికల్ ఇంజినీరింగ్ బ్లాక్, సివిల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్, ఇన్నోవేషన్ రీసెర్చ్ సెంటర్, స్పోర్ట్స్ ఆడిటోరియం, ఇతర ఇంజినీరింగ్ బ్లాక్‌లను అధికారులతో కలిసి పరిశీలించి, ఆయా బ్లాక్‌లలో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు వచ్చే బస్సుల రూట్ మ్యాప్, మీడియా కేంద్రం ఏర్పాటు, సిబ్బందికి భోజనం వసతి, వెహికల్ పార్కింగ్, సీసీ టీవీ కెమెరాలు, టీవీలు, హమాలీలు తదితరాలపై జెఎన్టీయూ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. పోలింగ్ అనంతరం వివిధ కేంద్రాల నుంచి రిసెప్షన్ సెంటర్లకు వచ్చే బస్సుల రూట్‌మ్యాప్ వాటి పార్కింగ్ మీడియా కేంద్రం, భోజనం, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ మోహన్‌ప్రసాద్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డీపీవో కె.భారతీ సౌజన్య, ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ జి.ప్రసాద్, ఏడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.